తాచెడ్డ కోతి

తాత కృష్ణమూర్తిగారు బి.ఏ;యల్.టి.

మొండివాదనైనా లక్ష్మిది సూక్ష్మబుద్ధి! నావిద్యాధిక్యత, నా తెలివితేటలు గుడ్డిగవ్వకు పనిచెయ్యకుండా ఉన్నాయి దానివాదనముందు. నాఊహాపోహలసందర్భాలనీ, నేనాడేమాటల కర్థంలేదనీ, నాఇంగ్లీషుచదువే నాకళ్ళుకప్పేస్తూవుందనీ, చదువుకున్నవాడినన్న అహంభావంకొద్దీ నిజంకనిపెట్టడానికి యత్నించననీ నిర్భయంగా 'ఛాలెంజి' చేసి చెప్తుంది నా మొహంయెదుట-భర్తనని మొగమాటమైనా లేక.

"స్త్రీలు, స్త్రీఉద్యమాలు అంటే నాకభిమానం లేదంటావా అయితే?" అన్నాను చిరునవ్వుతో.

"అయ్యో, లేకేమి? ఆడవాళ్ళంటే యిష్టంలేని మొగవాడుంటాడూ? అందులో మీప్రజ్ఞ చెప్పేదేమిటి? అందంగల ఆడది కనిపిస్తే అసలు మతేపోతుంది మీకు!" అని కళ్ళతో నవ్వింది తల తమాషాగా ఊపుతూ.

లక్ష్మికది పరిపాటే. నన్నెగతాళిచేసి నాతో హాస్యాలాడడం దానికి ముచ్చట.

"తెలుసు మీ మొగవాళ్ళనైజం! అంతా కపటమే. అభిమానం, స్నేహంచూపి సహాయంచేస్తున్నట్లునటించి గోతిలోతోస్తారు. తక్కిన మొగవాళ్ళకంటె మీరు మరోఆకు ఎక్కువే చదువుకున్నారు. ఆడవాళ్ళ హైన్యతకు జాలిచూపుతూ, వాళ్ళకు మేలుచేదామనే సంకల్పించుకొని తుదకు హానిచేస్తారు." అన్నదొకమాటు స్త్రీలనుగూర్చి నేనువ్రాసిన కథలపుస్తకం చదివి.

"అన్యాయంమాటలాడకు లక్ష్మీ! స్త్రీలంటే నాకెంతో గౌరవం. ఆడవాళ్ళ నన్యాయంచేసి పురుషుడధికారబలంచేత మత్తెక్కి విర్రవీగుతున్నాడని ప్రతీ మనిషికీ తెలుసు. అందుకనేకదా స్త్రీసంఘానికి నే నిట్టిఉపదేశాలిస్తున్నాను? నే చెప్పేమాటలలో కపటమేముందో చూపించు. 'స్త్రీలకి స్వాతంత్ర్యం కావాలి. విద్య కావాలి. ఆరోగ్యం కావాలి. సంఘంలో వాళ్ళు గౌరవంపొందగలగాలి. లోకంలో తలెత్తి తిరగడానికి సామర్థ్యం పొందాలి. వాళ్ళ మట్టుకు వాళ్ళు పోషించుకోగల శక్తి సంపాదించాలి. పురుషుడి అధికారానికి లొంగిపోకూడదు.' అని కదా నాబోధన? నాకథలలో, వ్యాసాలలో, ఉపన్యాసాలలో, సంభాషణలో నేను సూచించే అభిప్రాయమే ఇది. 'ఆడచెల్లెల్లారా! ఎన్నాళ్ళీదాస్యంలో పడి కొట్టుకుంటారు? ఇప్పటికైనా కళ్ళు తెరచి సంకెళ్ళు తెంపుకోండి.' అని కదా నామొర?" అని సమాధానం యిచ్చాను.

లక్ష్మి నావేపుఅట్టేచూస్తూ తలపంకించి చిత్రంగా విరిచింది మూతి. ఆలేడికళ్ళలో కోపం, జాలి, కొంటెతనం అన్నీ ఒక్కమాటే కనిపించాయి.

"మీతో వాదించి లాభంలేదు. మీధోరణే మీది. ఎదటివారిని అర్థంచేసుకుందామన్న మర్యాదేలేదు మీలో. ఒకరిమాట ఒకరికి పొందకుండా ఉంది మనకి" అంది నిట్టూర్పుతో.

పౌరుషంకలిగింది నాకు. ఒకరితో మాట్లాడేటప్పుడుగాని, తగవులాడినప్పుడుగాని బహుశాంతంగా తొందరపడకుండా అన్నీ అర్థంచేసుకొని మరీ నడుచుకుంటానే అని నాఅహంభావం. ఈమె అభిప్రాయమే తెలియలేదట నాకు! అంత మట్టిమెదడుతో మాట్లాడుతున్నానా? విచక్షణజ్ఞానమే లేదా నాకు? లాజిక్కు, లెక్కలు చదువుకున్న నాకే రీజనింగ్ శక్తి లేదంటుందే! బడిలో డిబేటింగుసొసైటీలంటే ఎరుగునా? మీటింగులలో డిస్కషన్ అంటే ఎన్నడైనా చూసిందా? కచేరీలలో న్యాయవాదులు చెప్పే ఆర్గ్యుమెంట్లు ఎన్నడైనా విన్నదా?— ఏఎక్స్పీరియన్సు లేదు లక్ష్మికి. బాగా స్కూల్ విద్య ఉన్నదైతే యిట్లా మాట్లాడుతుందా? ఇంచుమించు పాతికేళ్ళు ఉన్నాయన్నమాటేకాని లోకానుభవమేదీ లక్ష్మికి? ఇల్లు, పిల్లలు, పుస్తకాలు యింతే ఆమె లోకం! విద్యాజ్ఞానం తక్కువ, స్వతంత్రాలోచన లెక్కువ. పోనీ నన్ను గురువుగాభావించుకొని

నావిద్యలో కొంతసంపాదించుకొని, నాఉపదేశాలను మన్నిస్తూ, నాఅభిప్రాయాలతో ఏకీభవిస్తుందేమో అంటే అదీలేదు. మీదుమిక్కిలి నాకేబోధించి తన మతంలోకి తర్ఫీదుచేస్తానంటుంది. స్వతంత్రాలోచన లేని దాస్యబుద్ధిఅట నాది—సూచావాచా తేల్చిందొకమాటు. అడ్డమైన పుస్తకాలుచదివి, అందరి అభిప్రాయాలతోను ఏకీభవించి, ఈమహానుభావు డిట్లా అన్నాడనీ, ఆకవిశ్రేష్టు డట్లా వ్రాశాడనీ తప్పుడు కూతలు మనసుకెక్కించుకొని నామట్టుకునేను ఆలోచించుకోవడమే మానుకున్నానట!

ఒళ్ళుమండుతుంది నాకు ఒక్కొక్కప్పుడు లక్ష్మి అనేమాటలకు. దాని పొటుకుమాటలు, దాని పెంకెతనం - హద్దులేకుండా ఉంది దాని నిర్లక్ష్యానికి! ఏమన్నా ఓర్చుకుంటానని తెలుసు. నాకెంతకోపం వస్తేనేం? అవలీలగా నన్ను మరపించి, బుజ్జగించి, మంత్రించి వశపరచుకోగల నేర్పుంది ఆమెలో.

"కథచెప్తారులెండి మనవాళ్ళు. తూతికపిట్ట అన్నదట గర్వంగా 'నేనుగాని కాళ్ళుచాచి ఆకాశాన్ని తన్నిపెట్టి ఆపకపోతే యీలోకం గతి ఏమౌను?' అని. అట్లాఉంది మీసంగతి. స్త్రీలోకమంతా మిమ్మల్నిబ్రతిమాలుకుందా 'మాతరఫునపనిచెయ్యండి' అని? మాఊసెందుకూ మీకు?" అని పోట్లాడింది నిర్భయంగా.

"ఉపకారానికిపోతే అపకారం వెంటనే వచ్చిందంటారు యిందుకే—" అన్నాను నిట్టూర్పుతో.

"ఆడవాళ్ళ అభివృద్ధినిగూర్చి ఫలానా మహానుభావుడు పాటుబడుతున్నాడని పేరుసంపాదించుకుందుకా? ఎందుకీనటన? ఇంతకూ స్త్రీజనానికి మీరుచెయ్యగల సహాయమేముంది? వనకటికోవెధవావిడెకెవరో నమస్కారంచేస్తే 'నావలె చిరంజీవివై బ్రతుకు!' అని ఆశీర్వదించినదట. ఆమోస్తరుగానే ఉంటుంది మీమొగవాళ్ళుచేసే ఉపకారం!" అని విరసంగా నవ్వింది.

"ఏమిటీ? మామొగవాళ్ళంతా వెధవాయలా? మీఆడవాళ్ళనందర్నీ వెధవల్నిచేస్తున్నారా? నోటి దుడుసుతనం కూడదు. ఎందుకన్యాయంగా నిందిస్తావు?"

"నేనేమీ నిందారోపణచేయలేదు. ఉన్న నిజం మనవి చేస్తున్నాను. అంతే."

తృళ్ళిపడ్డాను నేను. విపరీతంగా వినిపించాయి లక్ష్మిమాటలు.

"నీఅభిప్రాయం తెలియలేదు నాకు" అన్నాను బొమలు ముడిచి.

"తెలియదు. నేనన్నదీ అదేకదూ? ఏదీఅర్థంచేసుకోలేనివాళ్ళు తగుదునమ్మా అని ప్రతీదానికీ ఎందుకు సిద్ధపడాలి? మీకేంతెలుసునని ఆడవాళ్ళసంగతి? వాళ్ళ ప్రకృతి, వాళ్ళ ఊహలు, వాళ్ళ ఆశయాలు ఏవీ మీమొగవాళ్ళకు తెలియవుకదా! సృష్టి ప్రారంభించినదిమొదలు ఈఅన్యాయం యిట్లానే వొస్తూవుంది. ఆడదాన్నిగూర్చి ప్రతీవిషయంలోను పురుషుడు కలగజేసుకొని, సర్వం తెలిసినవాడివలె నటించి తుదకు దాన్ని అధోగతికి తెచ్చాడు. భూమిమీద పడ్డది లగాయతు ఆడది ఎట్లా నడుచుకోవాలో పాపం దయతలచి అంతా నిర్ణయించాడు! అది చెయ్యవలసిన కర్మ విధించాడు. శాస్త్రాలు వ్రాశాడు. ఆచారపద్ధతులు నేర్పాడు. అన్నీ దానిమేలు తలపెట్టేచేసినట్లు నమ్మించాడు. తుదకు సంఘంలో దానికి ప్రత్యేకస్థానం లేకుండా చెయ్యగలిగాడు. ఆమెలోఉన్న ఇండివిడ్యుయాలిటీని చంపి తన బానిసను చేసుకున్నాడు స్త్రీని! ఈబానిసత్వమే ఆమెకు మోక్షం ప్రసాదిస్తుందంటాడు పైపెచ్చు. అమాయకంగా అతని బొల్లిమాటలకు అనేకశతాబ్దాలనుండి లొంగిపోయి ఇప్పుడీస్థితికివచ్చింది ఆడది!" అంటూ ఉద్రేకంతో ముక్కుపుటము లెగరవేస్తూ గంభీరంగా ఉపన్యసించడం ప్రారంభించింది.

మెల్లగానవ్వి "నిజమే అనుకుందాం మాటవరసకి. చేసినతప్పు దిద్దుకుందుకు పురుషుడు యత్నిస్తూవున్నప్పుడు మళ్ళీ అభ్యంతరపరచనేల? మంచి చెయ్యబోయేవాళ్ళనెందుకూ ఆటంకపరుస్తావు?" అని అడిగాను.

"మీవశంకాదు ఏంచెయ్యడానికీ యిప్పుడు. తోడేలు గొఱ్ఱెపిల్ల కేంసహాయంచేస్తుందో మీరూ ఆడదాని కట్టిసహాయమే చెయ్యగలరు. స్త్రీలకు స్వాతంత్ర్యం పురుషుడుసంపాదించడమేమిటి? అసందర్భం! ఇంతకూ అతగాడికిమాత్రం మహాయేడిసిందా యేమిటి నిజమైన స్వాతంత్ర్యం? ... దౌర్జన్యంచేసి ఆడదానిజన్మహక్కులన్నిటినీ లాక్కున్నదచాలదూ? సాగినన్నాళ్ళు అధికారంచెలాయించాలనేఉంటుంది కాబోలు!...కాని"

"అదికాదు లక్ష్మీ! నీఅపనమ్మకంకొద్దీ నువ్విట్లా మాట్లాడుతున్నావు. కాని దాస్యవిముక్తిపొంది ఆడది సంపూర్ణస్వాతంత్ర్యం అనుభవించాలని నాఅభిలాష. నేను పాటుపడుతున్న దందుకే" అనిచెప్పాను.

"మీఉద్దేశం మంచిదేకావచ్చును. కాని క్రియ మాత్రం సున్న. ఒకవేళ మీరు మేలుచెయ్యడానికే తలపెట్టినా పర్యవసానం కీడుగా పరిణమించక మానదు" అని కొంతసేపాలోచిస్తూ ఊరుకుంది.

"స్త్రీసంఘంలో ఇప్పుడుద్భవించినకల్లోలం మహా చిత్రమైనది" అని మళ్ళీచెప్పడం ప్రారంభించింది. "లేనిహక్కులు సంపాదించుకుందామనీ, పురుషులతో సమానంగా అన్నివిషయాలలోను ప్రవర్తిందామని ఏవో అర్థంకాని కోర్కెలతో కొట్టుకొంటున్నారు స్త్రీలు. మండుతూవున్న జ్వాలలో మీవంటి బుద్ధిమంతులు ఒక్కొక్క సమిధ వేస్తున్నారు. కొంపలంటుకొని సర్వనాశనం కావడానికి వచ్చినట్లుంది యిదంతా! పోగొట్టుకున్న స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడానికి స్త్రీ యత్నించడం సహజమే. అవసరమనికూడా ఒప్పుకుంటాను. కాని పురుషసహాయానికి ఆశించడం బుద్ధితక్కువ. ద్వేషరహితమైన శాంతియుద్ధంచేసి మొగవాడినిగెలిచి తనరాజ్యం తా స్వాధీనపరచుకోవాలి స్త్రీ. స్వాతంత్ర్యమనేది ఒకరు ప్రసాదించవలసినదికాదు. ఎవరిమట్టుకు వారే సంపాదించుకోవాలి. ఒకరిసహాయంపైని ఆధారం పెట్టుకుంటే మీదుమిక్కిలివాళ్ళకు కృతజ్ఞత చూపవలసిన అవసరంవస్తుంది. కృతజ్ఞత భక్తిగా మారుతుంది. భక్తి సేవలోకి దిగుతుంది. సేవ దాస్యంగా పరిణమిస్తుంది. ఈవిషమచక్రంలో తగులుకుంటే చుట్టూతిరిగి మళ్ళీ మొదటికేరావడం తటస్థిస్తుంది. ఏం లాభం?"

ఈఆర్గ్యుమెంటు చిత్రంగాతోచిందినాకు. "అందుకనే స్త్రీలు పురుషుల నెదిరించి, ధిక్కరించి స్వాతంత్ర్యం గణించుకోవాలంటున్నాను నేను"అన్నాను.

"జాతివైరం(Sex War) కూడదు!...స్త్రీపురుషులొకరితోఒకరు ఎన్నివైరాలు పెట్టుకున్నా ఒకరిపట్ల ఒకరికిగల సహజమైన ఆకర్షణ ఎన్నటికీ నశించదు. అట్టి ఆకర్షణే ఉభయులకూ కొంత శాంతినిస్తూవుంది. మీవంటి మహానుభావుల ప్రబోధాలవలన ఆకాస్త శాంతికూడా చస్తుందేమో!...స్త్రీలు తమ ఆధిక్యతను నిరూపించుకోవాలంటే సెక్సువైరంచూపి పురుషులతో పోటీచేసి వాళ్ళను జయించాలని కదా మీ ఉపదేశం? మాలోకూడా అనేకమంది ఈతప్పు అభిప్రాయంతోనే ఉన్నారు. అన్నివిషయాలలోను పురుషుడినే ఆదర్శంగా తీసుకొంటూవుంది ఈకాలపు నారీమణి. తనలోఉన్న ప్రత్యేకవ్యక్తిత్వం మరచిపోయింది. సృష్టికి మూలమైన ఆడ, మొగ అన్న లింగభేదంకూడా పాటించకుండా ఉంది. మొగవాడితో పోట్లాడి తనుకూడా మొగవాడవుదామని వెఱ్ఱిపడుతూవుంది. తుదకు ఉభయభ్రష్టత్వం అవుతుందేమో ఆమెగతి! నాగరికులమనీ, స్వాతంత్ర్యం గలవాళ్ళమనీ విఱ్ఱవీగే పాశ్చాత్యదేశయువతులకుకూడ యిదే వెఱ్ఱి. వాళ్ళు తమలోఉండే ఆడతనాన్ని చంపుకుంటున్నారు. మగచేష్టలు నేర్చుకుంటున్నారు. మాతృత్వం వహించడానికి అసహ్యించుకుంటున్నారు. దేవుడిచ్చిన అంగసౌష్ఠవాన్ని సహితం వికృతపరుచుకుంటున్నారు. మాటలలో, రూపంలో, చేష్టలలో అన్నిటిలోను పురుషత్వం వహిస్తున్నారు. దొరసాని జుట్టుకత్తిరించుకొని గుండుచేసుకొంటూవుంది. షరాయితొడిగి పులివేటకు సిద్ధపడుతూవుంది. ఈతలో, గుఱ్ఱపుస్వారీలో, కసరత్తులో పోటీకి నిలబడి మొగవాడిని ఓడిస్తూవుంది. ఫ్రాన్సులోను, అమె

రికాలోను ఈకాలపుబాలికలు కొందరు వక్షోజాలను పెరగనివ్వకుండా శస్త్రం చేయించుకుంటున్నారట. రూపంలోకూడా ఆడతనం విశదపడకూడదనీ అభిప్రాయం కాబోలు! చాతనయితే సృష్టికర్తతో దెబ్బలాడి మీసాలు గెడ్డాలు మొలిపించుకుంటారేమో! వివాహాన్ని వెక్కిరిస్తున్నారు. దాంపత్యాన్ని అగౌరవిస్తున్నారు. సంతానం అక్కరలేదంటున్నారు. పాతివ్రత్యాన్ని పరిహసిస్తున్నారు. సంఘాన్ని, దేవుణ్ణి ధిక్కరించి కళ్లెములులేని గుఱ్ఱాలవలె చెలరేగుతున్నారు. వినరానిమాటఏదైనా చెవినిసోకితేచాలు పూర్వకాలం స్త్రీలు మూర్ఛపోయేవారట! ఇప్పుడో ఆడవాళ్ళకు సహజంగా ఉండవలసిన బిడియం, భీతి, సిగ్గు, నాజూకు, సుకుమారత్వం అన్నీ అడుగంటి నశించాయి. శరీరలావణ్యం చెడిపోయింది. మాటలలో మార్దవంపోయి మోటుదనంవచ్చింది. శీలం, ముగ్ధత్వం, సరళత మొదలయిన విప్పుడు 'ఫాషన్సు' కావు! నేటి స్త్రీని 'అబల' అంటే మూతిమీద తంతుంది. మొగవాడికీ తనకీ యేమీ భేదం లేదనిన్నీ ఇరువురికీ సమానహక్కులే ఉండాలనిన్నీ ఈకాలపు స్త్రీ పోట్లాడుతూవుంది. ప్రపంచంలోఅన్ని దేశాలలోను యిదే కలకలము. ఒక్క ఇటలీలోమాత్రం స్త్రీలు స్త్రీలుగానేఉండడానికి ఇష్టపడుతున్నారు. ఇటీవల హిందూదేశపు స్త్రీలలోకూడా యిట్టి సంచలమే ఉద్భవించింది. మగరుచులకు అలవాటు చేసుకుంటున్నారు మన స్త్రీలు. మగవాళ్ళ ఆటలు, మగవాళ్ళ చదువులు, మగవాళ్ళ పనులు, మగవాళ్ళ మాట -- అన్నీ మగవాళ్ళవే అభ్యసిస్తున్నారు. ఈనవీననాగరికత స్త్రీలను అభివృద్ధికితేక క్రిందికి దిగలాగుతూవుంది. ఆడది మొగవాడివలె ప్రవర్తించబోయినా, మగవాడు ఆడదానివలె నడుచుకున్నా పరమఅసహ్యంగా ఉంటుంది. మీ మొగవాళ్ళలో ఆడంగివెధవలని ఉంటారు ఎరగరూ? ఆడమొగలంటూరు వాళ్ళని. వాళ్ళ పేడిమొహాలు, ఆడచేష్టలు చూస్తే రోతపుడుతుంది. వాళ్ళలో కొందరు బట్టకట్టులోకూడా ఆడతనం వెల్లడిపరచుకుంటారు. చీరె కడతారు. జుట్టుపెంచి పువ్వులు ముడుచుకుంటారు. కాటుకపెడతారు. ఒయ్యారంగా పైట సర్దుకోవడం అభినయిస్తారు. తిప్పుకుంటూనడుస్తారు. క్రేగంటిచూపులతో. సిగ్గుపడిపోతూ మొగవాళ్ళతో నంగిరి నంగిరిగా మాట్లాడుతారు. ఎన్నెన్ని వెధవచేష్టలు చెయ్యాలో అన్నీ చేస్తారు. అట్టిఅధముల్ని చూసి ఆడవాళ్ళు నవ్వుకుంటారు జాలిపడి. మొగవాళ్ళు రోతపడి కోపగించుకుంటారు. వీళ్ళమోస్తరే మాఆడవాళ్ళలో కూడా మగలక్షణాలుగలవారున్నారు. గట్టిశరీరం, మోటుమొహం, బల్లపరుపువక్షం, బొంగురుగొంతుక, మూతిమీద చిన్నమీసకట్టు మొదలయిన అవలక్షణాలుగల వయ్యారు లెందరో ఉన్నారు. ప్రకృతివిరుద్ధమైన చేతగాని పనులుకూడా చెయ్యడానికి పాపం ముచ్చటపడతారట వీళ్ళు! మొగవాళ్ళను చూస్తే భయపడి దూరదూరంగా జరగడం, ఆడవాళ్ళని చూసి మోజుపడడం-ఏమనిచెప్పను వాళ్ళచర్యలు! ఎవరిలోఉండే సహజశక్తులను వాళ్ళు దోహదం చేసి పెంచుకుంటే అవి రాణిస్తాయి. లేనిశక్తులు నటించడానికి యత్నిస్తే అవి బెడిసికొడతాయి. ఆడదాని 'గ్లోరీ' ఆడతనంలోను, మగవాడిఘనత మొగతనంలోను స్పష్టపడాలి. అంతేకాని వీళ్ళలో ఉండే ఔన్నత్యం వాళ్ళుసంపాదించడానికి యత్నించడం అసహజమేకాక బుద్ధిహీనం!"

నిర్ఘాంతపడి వింటూకూచున్నాను లక్ష్మిఉపన్యాసం. ఏంచెప్పడానికీ తోచలేదు కొంతసేపటివరకూ. స్త్రీల మూవ్మెంటులో నడుంకట్టి పని చేదామన్న అభిలాషేకాని ఈసంగతులన్నీ తట్టలేదు నాకెన్నడూ. నేనుచేసేకృషి యావత్తూ స్త్రీలోకానికి మేలుచెయ్యడానికిబదులు కీడుచేస్తుందని ఘంటాపథంగా చెపుతూవుంది లక్ష్మి. అయితే నేనేపని తలపెట్టినా పరిహాసంచేసి ఆక్షేపించడం దానికి మామూలే. ఒక్కొక్కప్పుడు కేవలం పెంకెతనానికే తీవ్రంగా వాదిస్తుంది నాతో. మనసులో నాయభిప్రాయాలను మన్నించినా పైకిమాత్రం అడ్డువాదన చేస్తుంది. కళ్ళలో నవ్వుపొంగుకొచ్చినా మూతి

బిగించి గంభీరంగా పెడుతుంది మొహం! లక్ష్మిలో ఉన్న హాస్యం, అలక, పెంకెతనం అన్నిలక్షణాలు నాకు అనుభవవేద్యములే కాని ఇప్పుడున్నంత 'సీరియస్‌నెస్' ఆమెముఖంలో నాకెన్నడూ పొడగట్టలేదు. దాని నవ్వుమొహంలో కపటం దాగదు.

"సరేకాని లక్ష్మీ! స్త్రీల పురోభివృద్ధికి పాటుపడాలనుకున్న బుద్ధిమంతు లిప్పుడు ఏంచెయ్యాలని నీఅభిప్రాయం? నీధోరణిచూస్తే తప్పంతా మగవాళ్లదేనని సారాంశం తేలేటట్లుంది. ఆడవాళ్లకి మేం మొగతనం నేర్పి, ఆవుదూడల్ని గేదెదూడలుగా చెయ్యబోయి అర్థాన్నపుదూడల్ని చేస్తూఉన్నట్టు చెపుతున్నావు! న్యాయమేనా?" అని నవ్వుతూ అడిగాను.

"సొంతం చెప్పేదాకావినండి. ఆనక దెబ్బలాడుదురుగాని. మీమొగవాళ్లేమో మహాఘనులైనట్లు తమప్రతాపాలన్నీ నేర్పుతామంటారు స్త్రీకి. అన్నీ అవకతవకసలహాలే యిస్తారుకదా! వాటి పర్యవసానం మన స్త్రీలలో కొంతవరకు ప్రత్యక్షమాతూనే ఉంది కదా? అంతకంతకూ మీరు సెక్సువైరం పెంచుతున్నారుకాని మరేమీలేదు. మీదుమిక్కిలి 'ఇమాన్సిపేషన్' అనీ, 'ఇండిపెండెన్స్'అనీ, 'ఇండివిడ్యుయాలిటీ' అనీ, 'స్వరాజ్' అనీ పెద్దపెద్దపేర్లు చెప్పి భ్రమింపజేస్తున్నారు స్త్రీని. ఔనా?" అన్నది ఉద్రేకస్వరంతో.

"అదికాదు. ఆడదానిలో అనేకఅద్భుతశక్తులు ఉన్నాయనీ, వాటిని బయటికి రానివ్వకుండా మగవాడు అణచిపెడుతున్నాడనీ, సంఘం కొంతవరకు వాడికి తోడ్పడుతూఉందనీ కాబట్టి స్త్రీ యిప్పుడు స్వాతంత్ర్యురాలవుదామంటే పురుషుడి నెదిరించి ప్రతీవిషయంలోను తనుకూడా శక్తిసామర్థ్యాలుగలమనిషే అని రుజువుచెయ్యాలనీ, సంఘనిబంధనలను ధిక్కరించాలనీ, అవసరమైతే యిప్పుడున్న సంఘాన్ని శిథిలంచెయ్యాలనీ, ముఖ్యంగా తన ఇండివిడ్యుయాలిటీని ప్రకటించుకోవాలనీ నాఉపదేశం" అని సమాధానంయిచ్చాను.

"పొరబడుతున్నారు మీరు. స్వేచ్ఛంటే సంఘతిరస్కారమని అర్థంకాదు. సంఘంలో లోటుపాట్లుంటే సవరించడం మెప్పు-చాతనయితే. అంతేకాని సంఘాన్ని భగ్నంచేసి దేవునై గురువునై అనినడుచుకుందామంటే వీలులేదు. ఈ సంసారసాగరంలో మానవజీవితమొక పడవవంటిది. సంఘము దానికొక చుక్కాని. ప్రత్యేకవ్యక్తిత్వమంటే ఏకాకితనమనుకోకూడదు" అంటూ యోచిస్తూ ఒకక్షణం ఊరుకుంది.

"—అదిగాక" అని ప్రారంభించింది మళ్ళీ. "ప్రత్యేకవ్యక్తుల యిష్టాయిష్టాలను లోకం మన్నించదలచుకున్నప్పుడు సంఘానికిగలబలం సహజంగా క్షీణిస్తుంది. ఒకయింట్లోఉన్న ప్రతిమనిషీ యెవరి యిష్టం వొప్పిన వారు నడుచుకుంటామన్నా, లేక అందరూకూడా అన్నిపనులు చెయ్యడానికి సిద్ధపడినా ఆఇల్లు నిమిషంలో కూలవలసిందేకదా? మానవసంఘంకూడా ఒకగృహం వంటిదే. జనుల అన్యోన్యసహాయం వల్లనే సంఘానికి కొంత ఐకమత్యం, గౌరవం, బలం కలుగుతూఉన్నవి. సంఘసౌఖ్యం, సంఘహక్కులు పొందాలంటే నరుడు సంఘాన్ని ధిక్కరించరాదు—ధిక్కరించకూడదు. ఈఇరవయ్యోశతాబ్దంలో అందరికీ ఒకవేపిచ్చిపట్టుకుంది. ప్రతీమనిషీ తనజీవితాన్ని ప్రత్యేకంగా తనే నడుపుకుందుకు యత్నం - సంఘసహాయంకాని యితరసహాయంకాని కోరకుండా. కాని యిందులో ఉన్నప్రమాదం ఎవరూ గుర్తించకుండాఉన్నారు. సంఘాన్ని వదులుకోజూచిన వ్యక్తికి నిజంగా ఆలోచిస్తే ప్రత్యేకస్థానం ఈభూమిమీద ఎక్కడాలేదు. రాజ్యాంగవేత్తల కీరహస్యం తెలుసును. ఏదేశం ఇష్టంవచ్చినట్లు ఆదేశం నడుచుకోవడంతో లోకానికి గొప్పముప్పు అనే సంగతి మొన్నటి జర్మనీయుద్ధంతో అందరికీ విశదమైంది.

కనుకనే 'లీగ్ ఆఫ్ నేషన్స్' అనే నానాదేశసంఘ మొకటి నిర్మింపబడ్డది. ప్రత్యేకజీవితమనేది ఒక వ్యక్తికిగాని ఒకదేశానికిగాని పొసగని సంగతి! అది గాక ప్రత్యేకజీవితానికి స్వాతంత్ర్య జీవితానికి యెంతో వ్యత్యాసముంది. అది గ్రహించక స్వాతంత్ర్యంలోగల మహత్యం ప్రత్యేకవ్యక్తిత్వంలో ఉన్నదని మగవాడు బోధిస్తున్నాడు స్త్రీకి. స్వేచ్ఛ అనుభవించడమంటే యిష్టంవచ్చినట్లు చెలరేగడం కాదు. ఇండిపెండెన్స్ అంటే ఐసొలేషన్ కాదు! నాగరికతంటే అన్యదేశలోపాలను అలవరుచుకోవడం కాదు. కాని పురుషు డుష్ట్రపక్షివంటివాడు. అహంభావమనే యిసుకలో తలదూర్చి, నిజాన్ని చూడడానికి యిష్టపడడు. నాగరికతన్న పేరున ఎన్నెన్ని అరాచకాలైనా చేస్తున్నాడు. తన జీవితాన్ని అసౌఖ్యమయంగా చేసుకుంటున్నాడు. తా చెడ్డకోతి వనమంతా చెరచిందన్నట్లుఆడదాన్నికూడా ఈడుస్తున్నాడీతప్పుతోవలోకి! తనలో తననడవడికలో ఉండే వక్రత గుర్తించడు. వేమన్న చెప్పినదే వేదమన్నట్లు తా సూచించిన మార్గాన్నే ఆడది నడుచుకొని బాగుపడాలంటాడు. తనవిద్యలు, తనఆశయాలు, తన పరిశ్రమలుఅన్నీ తనవే స్త్రీలకుకూడా ముక్తిదాయకములనుకుంటాడు. నవీననాగరికతకు తానెట్లా వశమౌతున్నాడో ఆడదాన్నికూడా అట్లే వశపరచాలని కోరుతున్నాడు. పులినిచూసి నక్క వాతపెట్టుకున్నట్లు స్వాతంత్ర్యం, రాజ్యైశ్వర్యంగల పాశ్చాత్యదేశస్థులను మార్గదర్శకులుగాతీసికొని హిందువుడు తనలో ఉన్నగొప్పతనాన్ని రూపుమాపుకున్నాడు. ఆడదాని పూర్వాచారపద్ధతుల నెగతాళిచేసి దాని నొకదొరసానివలె తర్ఫీదుచెయ్యబోతున్నాడు. 'అయితే ఆడదానికి స్వతంత్రబుద్ధిలేదా? మగవాడిబోధన లెందుకు వినాలి? దానిదారి నది నడుచుకోరాదా?' అని అడుగుతారేమో! ఆడదానిప్రకృతిలో ఒకచిత్రమైన లక్షణమున్నది. స్వార్థత్యాగం ఆమెకు సహజభూషణం! ఒకరికొరకు, ఒకరిని సంతోషపరచుటకొరకు ఆమె చేయగల త్యాగాలకు మితిలేదు. తనసౌఖ్యం చూసుకోదు. తన బ్రతుకుతెరవు ఆలోచించదు. తనమేలు కాశించదు. పరోపకారానికిపోయి పడరాని పాట్లు పడుతుంది. దేనికీ విసుగులేదు; కించలేదు; పగలేదు; ఫలాపేక్షలేదు. క్షమాదేవివలె పురుషుడి లోపాలను మన్నిస్తూ, అతని అత్యాచారాలను సహిస్తూ అతని సేవకై తనజీవితాన్ని వినియోగపరుస్తుంది! చెడ్డపని అయినాసరే పురుషుడికి హితవుగూర్చేదని తలచినప్పుడు తప్పకచేస్తుంది. మగజాతియెడల అనాదినుండి ఆమెకట్టి అభిమానంకలదు. అయితే మొగవాడు తనప్రతాపంకొద్దీ ఆడదాన్ని తన చిటికెనవేలుమీద తిప్పుకోగలుగుతున్నట్లు భావిస్తాడు! పురుషుడి ఉపదేశాలలోగల వక్రత గుర్తెరిగికూడా అతను చెప్పినచొప్పున ఆచరించినందుకు సంబరపడుతుంది స్త్రీ. అతని అసందర్భపుఆజ్ఞలను పాలిస్తుంది. పిచ్చిసలహాలను వింటుంది. నూతిలోపడుఅంటే పడుతుంది. అగ్నిలో దుమకమంటే సిద్ధపడింది సీత. సంతలో పశువునమ్మినట్లు నడిబజారులో పెళ్లాన్ని విక్రయిస్తానంటే ఒప్పుకుంది చంద్రమతి. కొడుకును విషంపెట్టి చంపుతానని హిరణ్యాకశిపుడంటే నోరెత్తలేదు అతని భార్య. మనసు కర్ణుడిమీదఉన్నా పాండవుల్ని ఐదుగురినీ మెడకుకట్టుకొని భరించమంటే ఎదురు చెప్పలేదు ద్రౌపది. మొగుడుచస్తే వాడి చితిమీద సహగమనం చెయ్యడం ధర్మమని బోధిస్తే సరేనన్నది హిందూనారి. ఎన్నిశతాబ్దాలుగడచినా దేశకాలపరిస్థితులలో ఎన్నిమార్పులు వచ్చినా, ఆడదాని ప్రకృతిలో మాత్రం ఈనైజం మారలేదు. మొగవాడంటే పడిచస్తుంది. వాడిమాటంటే వేదవాక్యంగా భావిస్తుంది.' నాగరికత అభివృద్ధిపొందిన ఈరోజులలో కూడా మనహిందూస్త్రీ ఎప్పటివలెనేఉన్నది. 'మన పురాణాలు పుక్కిటికథలు చదువకు; ఇంగ్లీషు నేర్చుకో; పసుపు కాటుక విడిచిపెట్టు; ఫేస్ పౌడరు పిన్నులు వాడు; ఆచారమనీ, పూర్వసాంప్రదాయమనీ అనాగరీకంగా ఉండకు; ఓటింగుహక్కులకు పోట్లాడు; విడాకులచట్టంకావాలని మొర పెట్టు; మొగవాడిఉద్యోగాలకు పోటీచెయ్యి; కొత్తఫాషన్లు

నేర్చుకో; దొరసానివైపోవాలి నువ్వు.' అని కాని భర్త ఉపదేశిస్తే 'అలాగే' అంటుంది. లేక 'మన దేశచరిత్ర చదువు; హిందీ నేర్చుకో; రాట్నం వడికి ఖద్దరు-చీర కట్టుకో; కల్లుదుకాణాలు పికెట్ చేసి దేశంకోసం పాటుపడు; నాతోపాటు జైలుకు పద' అని చెప్తే 'సరే' అంటుంది. ఆడదానికెట్టి స్వాతంత్ర్యం కావాలో అది సంపాదించుకుందుకు ఆమె ఏవిధంగా పాటుపడాలో, ఆమెకెట్టి నాగరికత అవసరమో, ఆమెజీవితాని కేది సౌఖ్యప్రదమో అన్నీ తనే నిర్ణయిస్తానంటాడు పురుషుడు. దేనికీ అభ్యంతరం చెప్పదామె! "ఆడదానికి మెదడు,హృదయం, అనేవి లేవనుకుంటాడుకాబోలు పురుషుడు! మెత్తని వాళ్ళనుచూస్తె మొత్తబుద్ధి అంటారు ఇందుకేనేమో. మామంచిదనమే మాకు శత్రువౌతూవుంది. మగవాడి ఉపదేశాలను లక్ష్యపెట్టక తనకు దేవుడిచ్చిన గౌరవాన్ని తను నిలబెట్టుకుందుకు పాటుపడితే ఆడది స్వాతంత్ర్యరాలవుతుంది."

లక్ష్మిమాటలు విన్నపిమ్మట దీర్ఘంగా ఆలోచించవలసివచ్చింది. అనేకసమస్యలతో మెదడు వేడెక్కి ఏదీ సరియైనసమాధానం అప్పటిమట్టుకు తోచలేదు.

"నన్ను నువ్వేమన్నా సరిపోతుంది కాని పురుషలోకాన్నంతా దూషించకు. నీ పుణ్యముంటుంది. ఇంతకూ అసలు నీమనసులోఉన్న అభిప్రాయమేదో స్పష్టంగా అర్థంకాలేదు నాకు" అన్నాను.

"ఆడవాళ్ళ నెట్లా అర్థంచేసుకోగలరు మీరు?" అంటూ పక్కున నవ్వింది.

అమృతవార్త

శ్రీమతి చేబ్రోలు సూరమ్మగారు

అది వసంతాగమావసరము.

నాఁటిసాయంకాలము సూర్యాస్తమయమున కొకఘడియపూర్వ మెటనుండియో తియ్యని కోకిలారావము వినవచ్చుచుండెను.

ఆపికస్వర మాలకించుచు నాచిక్కనితరుచ్ఛాయ నట్లే నిలువఁబడిపోతిని.

గానమాధుర్యమునకు మూర్ఛఁ జెందితిని.

కొంతసేపటికిఁ దెలివివచ్చి నలుగడలఁ బరికించితిని.

సంధ్యారుణకాంతులు జారిపోయినట్లు జాడలుపొడకట్టెను.

ఇఁక నామేను మఱపించిన ఆపాటకొఱకు వెతక నారంభించితిని.

కాని అంతయు నిశ్శబ్దమే.

నాకుఁ దెలివివచ్చుటకు పూర్వమే పికకుమారి యేవంకకో పలాయనమైపోయిన ట్లప్పుడప్పుడే వ్యాపించుచున్న నిశాకరునమృతకిరణములు సందేశమిచ్చినవి.

అంతనశనిపాతాఘాతమునఁగూలు నున్నతసౌధమువలె నాయెడఁద క్రుంగిపోయెను.

కొంతసేపేమియుఁ దోపమి నట్లే గూలియుంటిని. ఆసమయమున నాకుఁ దెలియకయే యేనల్లారుముద్దుగాఁ బెంచుకొనుచున్న మల్లెతీవ జ్ఞప్తికివచ్చెను.

తోడనే చల్లని మలయపవనుఁడు కదలిరా నారంభించెను.

ఆమందమలయానిలులయనొంది నాపెంచుకున్న మల్లెనుండి నవవికసితసుమవల్లరుల యమృతమయసౌరభశుభవార్త నాకవగాహమయ్యెను.

అంత నాయానందమునకు మేరయే లేకపోయెను.